సాక్షి విజయనగరం

గురువారం । 29 । ఫిబ్రవరి । 2024



అభివృద్ధి వెం'బడి'

ప్రభుత్వ బడుల్లో డిజిటల్ చదువులు చక్కగా సాగుతున్నాయని ఏపీఈడబ్ల్యూఐడీసీ వై.నాగార్జున యాదవ్ అన్నారు. - 8లో



దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిల్స్ పంపిణీ - 8లో

జెడ్పీ నిధులతో కొనుగోలు చేసిన బ్యాటరీ ట్రై సైకిల్స్‌ను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు దివ్యాంగులకు అందజేశారు.



ఆధునిక సాంకేతికత పెంపొందించుకోవాలి - 8లో

సాంకేతిక నైపుణ్యాలతో ఉన్నత ఉద్యోగాలు పొందవచ్చని జేఎన్‌టీయూ జీవీ వీసీ కె.వెంకటసుబ్బయ్య విద్యార్థులకు హితబోధచేశారు.

న్యూస్‌రీల్

సమస్యలు సృష్టించేవారిపై బైండోవర్



మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: క్షేత్ర స్థాయిలో సమస్యలు సృష్టించే వ్యక్తులను గుర్తించి, వారిని బైండోవర్ చేయాలని ఎస్పీ ఎం.దీపిక అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మాసాంతర నేర సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై సంబంధిత సెక్షన్లతో కేసులు నమోదు చేయాలన్నారు. సోషల్ మీడియాలో పెట్టే పోస్టులపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలన్నారు. స్టేషన్ స్థాయిలో హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తుల్లో నేర ప్రవృత్తి కలిగిన చురుకైన వ్యక్తులను గుర్తించి, ప్రతి శనివారం వారిని స్టేషన్‌కు పిలిపించి, కౌన్సెలింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల విధులపై దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ట్రెయినీ ఐపీఎస్ కుమారి మండ జావలి అల్ఫాన్స్, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

3 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్



సంకిలి కర్మాగారానికి తరలిస్తున్న చెరకు

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామం వద్ద ఉన్న ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో 3లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ పూర్తయినట్లు అసోసియేటివ్ వైస్ ప్రెసిడెంట్ పట్టాభి రామిరెడ్డి వెల్లడించారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో రైతులు సాగుచేసిన చెరకును నరికేందుకు తుని, అన్నవరం, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి కూలీలు తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ ఏడాది 4.10 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ లక్ష్యంగా చేసుకున్నామన్నారు. ప్రస్తుతం రైతులు కటింగ్ ఆర్డర్లు తీసుకుని, చెరకును కోసిన వెంటనే ఫ్యాక్టరీకి తరలిస్తున్నారని తెలిపారు.

ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు

విజయనగరం అర్బన్: స్వీప్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మార్చి 1 నుంచి ఓటర్ల అవగాహనా కార్యక్రమాలను ముమ్మురంగా చేస్తామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. స్వీప్ కార్యక్రమం షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేశారు. ఓటర్లను చైతన్య పరిచే కార్యక్రమాల్లో రాజకీయ పార్టీలు భాగస్వాములు కావాలని కోరారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులు, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను వివరించారు. పోలింగ్ కేంద్రాలను, కౌంటింగ్ సెంటర్లను ఖరారు చేసిన జాబితాను మార్చి 5వ తేదీలోగా పంపించాల్సి ఉంటుందని చెప్పారు. సమావేశంలో ఈఆర్‌ఓలు, డిప్యూటీ తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు రొంగలి పోతన్న, కుటుంబరావు, దాయానంద్, రమేష్‌కుమార్, సోములు, ప్రభాకరరావు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల



కె.రాజ్‌కుమార్, జెడ్పీ సీఈఓ

విజయనగరం రూరల్: 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం మొదటి విడత నిధులు విడుదలైనట్లు జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్ బుధవారం తెలిపారు. జెడ్పీకు మొదటి వాయిదా టైడ్, బేసిక్ గ్రాంట్లు కలిపి రూ.8,11,66,714లు విడుదలయ్యాయన్నారు. జెడ్పీ పరిధిలోని 34 మండల పరిషత్‌లకు 2023-2024 సంవత్సరానికి మొదటి విడత టైడ్, బేసిక్ గ్రాంట్లు కలిపి రూ.8,12,85,870లు విడుదలయ్యాయన్నారు.

ఓటుకు బకెట్



ఈ చిత్రం చూడండి.. జనసేన పార్టీ కండువా వేసుకొని బకెట్ అందిస్తున్నది నెల్లిమర్లలో జనసేన–టీడీపీ ఉమ్మడి అభ్యర్థి లోకం మాధవి. ఆ బకెట్‌పై ముద్రించిన చిత్రాన్ని గమనించండి. దానిపై ఆమె బొమ్మ, ఆ పక్కనే ఆమె పార్టీ గుర్తు గాజుగ్లాస్ చూడొచ్చు. ఎన్నికల కోడ్ రాకముందే ఇలా తన బొమ్మ, తన పార్టీ గుర్తు ఉన్న బకెట్లను ఇంటికొకటి చొప్పున పంచేస్తున్నారు. దీనికోసం భారీ సంఖ్యలో బకెట్లను తీసుకొచ్చి గుట్టుచప్పుడు గాకుండా తమ అనుయాయుల కోళ్ల ఫారాల్లోనూ, ఖాళీ గోదాంల్లోనూ భద్రపరుస్తున్నారు. అక్కడి నుంచి గ్రామగ్రామానికి తీసుకెళ్లి పంపిణీ చేస్తున్నారు.



ఈ చిత్రం చూశారా? పేరుకు ఆర్‌కే ఎడ్యుకేషన్ సర్వీసు... కానీ ఆ ముసుగులో పక్కా ఎన్నికల తాయిలాల పంపిణీ జరుగుతోంది. ఆ సంస్థ బ్యానర్‌పై చంద్రబాబు, లోకేశ్, అచ్చెన్నాయుడు, అశోక్ గజపతిరాజు తదితర టీడీపీ నాయకుల చిత్రాలు చూడవచ్చు. శృంగవరపుకోట నియోజకవర్గంలో గత కొన్ని నెలలుగా ఏదో ఒక పేరుతో తాయిలాల పంపిణీని టీడీపీ నాయకుడు గొంప కృష్ణ ప్రారంభించారు. చీరలు, పుస్తకాలు, స్ప్రేయర్లు, తోపుడు బళ్లు ఇలా పంపిణీ చేసుకుంటూ పోతున్నారు. విద్యార్థులకు పోటీ పరీక్షలు, ముగ్గుల పోటీలు నిర్వహించి వారికి తాయిలాలు వేస్తున్నారు. ఇంకా టికెట్ ఖరారుకాక పోయినా పోటీదారు కోళ్ల లలితకుమారి కన్నా ముందుండాలనే లక్ష్యంతో ఈ మార్గం ఎంచుకున్నారు.

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పాలనకు జనం ఫిదా అవుతున్నారు. ఇంటివద్దకే సేవలు చేరువచేసిన ప్రభుత్వానికి జేజేలు పలుకుతున్నారు. 'గడపగడపకూ' వచ్చి కష్టాలు తెలుసుకుని, సంక్షేమ పథకాలను అందించి.. ఊరి సమస్యలను పరిష్కరించిన నేతలకు పట్టం కట్టేందుకు సంసిద్ధులయ్యారు. ఈ విషయాన్ని తెలుసుకున్న టీడీపీ–జనసేన పార్టీ నాయకులు ఓటర్లను మభ్యపెట్టే యత్నాలకు దిగారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ముందస్తుగానే తాయిలాలు పంచుతున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు సూచనల మేరకు ముందుగా ఎలాగోలా ఓటర్లను ఎరవేసి తర్వాత మోసంచేసే సూత్రాన్ని అమలుచేస్తున్నారు. దీనికి ఈ చిత్రాలే సజీవ సాక్ష్యం.

- నెల్లిమర్ల నియోజకవర్గంలో టీడీపీ–జనసేన అభ్యర్థి తాయిలాలు
- తన ఫొటో ముద్రించిన ప్లాస్టిక్ బకెట్ల పంపిణీ
- ఎస్.కోట నియోజకవర్గంలో గొంప కృష్ణ ఎన్నికల బహుమతులు
- టికెట్ ఖరారుకాక ముందే చీరలు, స్ప్రేయర్ల పందేరం
- సేవ ముసుగులో డబ్బు పంచుతున్న బొబ్బిలి అభ్యర్థి బేబీనాయన!



నెల్లిమర్ల మండలం అల్తిపాలెం వద్ద ఓ కోళ్ల ఫారంలో జనసేన అభ్యర్థి భద్రపరిచిన బకెట్లు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: కోవిడ్ మహమ్మారి కమ్మేసినప్పుడు టీడీపీ నాయకులు ఎవ్వరూ కనిపించలేదు. గత నాలుగున్నరేళ్లలో ప్రజలకు ఏ కష్టం వచ్చినా పలుకరించినదీ లేదు. సరిగ్గా సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓట్ల కోసం బకెట్లు పెడుతున్నారు. సేవ పేరుతో తాయిలాలు పంచుతున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో చావుదెబ్బ తిన్న టీడీపీకి ఎలాగైనా ఊపిరిలూదాలని తాపత్రయపడుతున్నారు. శృంగవరపుకోట నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మరోసారి టీడీపీ టిక్కెట్ ఆశిస్తున్నారు. అయితే, గత ఎన్నికల్లో



ఎస్.కోటలో తోపుడు బండిని అందజేస్తున్న టీడీపీ నాయకుడు గొంప కృష్ణ

ఆమె సరిగ్గా తాయిలాలు, డబ్బు పంచలేదనే అనుమానాలు పార్టీ అధిష్టానానికి ఉన్నాయి. అందుకే గత ఎన్నికల్లో ఓడిపోయామని లోకేశ్ తోడల్లుడు, విశాఖ పార్లమెంటరీ అభ్యర్థి శ్రీభరత్ పలుమార్లు చెప్పకనేచెప్పారు. ఈసారి ఆమెను గాడిలో పెట్టేందుకు లోకేశ్ పోటీదారుడిని పెట్టారు. తనకు బాగా పరిచయమున్న గొంప కృష్ణను నియోజకవర్గంలో తిప్పుతున్నారు. దీంతో కోళ్ల లలితకుమారి కూడా చేతిచమురు వదిలించుకోక తప్పట్లేదు.

కోట వదిలి బయటకు...

బొబ్బిలి టీడీపీ టికెట్ ఖరారైన తర్వాతే బేబీనాయన కోట దాటి అడుగుపెడుతున్నారు. ఇదేం ఖర్మ కార్యక్రమానికి చంద్రబాబు బొబ్బిలి వచ్చినప్పుడు ఆయనకు భరోసా దక్కింది. అప్పటి నుంచి సేవ పేరుతో వైఎస్సార్‌సీపీ గ్రామస్థాయి నాయకులకు ఎర వేస్తున్నారు. ఒక్కొక్కరిని కోటకు రప్పించుకొని ఖర్చులకు ఉంచండంటూ కొంత డబ్బును వారి జేబుల్లో పెడుతున్నారు. రానివారికి తన సహాయకులు మోళీ, కృష్ణ ద్వారా సొమ్ము పంపిస్తున్నారని వినికిడి. ఇవన్నీ ఎన్నికల్లో లబ్ధి కోసమేనన్నది జగమెరిగిన సత్యం.

బకెట్లతో లోకం మాధవి...

మిరాకిల్ సంస్థల అధినేతగా రూ.కోట్లకు పడగలెత్తిన లోకం మాధవి రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఒక ప్రణాళిక ప్రకారం జనసేన అధినేత పవన్ కల్యాణ్ దృష్టిలో పడ్డారు. టీడీపీ–జనసేన తొలి జాబితాలోనే తన పేరు ఉండేలా పావులు కదిపారు. అంతవరకూ ఎమ్మెల్యే కుర్చీపై ఆశతో బాగానే చేతిచమురు వదిలించుకున్న టీడీపీ నాయకుడు కర్రోతు బంగార్రాజుకు ఎసరుపెట్టారు. 'అప్పు'తో టిప్ వేశారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అందుకే టికెట్ దక్కలేదని బాధపడాల్సింది పోయి క్యాడర్‌కు హితబోధ చేస్తున్నారేమిటని టీడీపీ కార్యకర్తలే చెవులు కొరుక్కుంటున్నారు.

రైతన్న ఖాతాకు సాగు సాయం



- మూడోవిడత వైఎస్సార్ రైతుభరోసా–పీఎం కిసాన్ నిధుల విడుదల
- జిల్లాలోని 2.63 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.52.73 కోట్లు జమ
- సున్నావడ్డీ పంట రుణాల కింద రూ.8.94 కోట్లు జమ
- వ్యవసాయానికి ప్రభుత్వ తోడ్పాటుతో రైతుల్లో సంతోషం



రైతన్నలకు వైఎస్సార్ రైతుభరోసా–పీఎం కిసాన్ నిధుల మెగా చెక్కును అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

విజయనగరం అర్బన్: పొలంలో ఆరుగాలం శ్రమించి అందరికీ అన్నంపెట్టే రైతన్నకు జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఏటా పంటల సాగుకు అవసరమయ్యే పెట్టుబడి సాయాన్ని ఠంచన్‌గా అందిస్తోంది. ఐదో ఏడాది మూడో విడత వైఎస్సార్ రైతుభరోసా–పీఎం కిసాన్ నిధులను తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం విడుదల చేశారు. బటన్ నొక్కి రైతుల ఖాతాకు జమచేశారు. జిల్లాలోని 2,63,414 మంది రైతులకు రూ.52.73 కోట్ల మొత్తాన్ని విడుదల చేశారు. అలాగే, సున్నావడ్డీ పంట రుణాల పథకం కింద 46,460 మంది రైతులకు రూ.8.894 కోట్లను బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. వర్చువల్ విధానంలో సాగిన కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్ రైతుభరోసా–పీఎం కిసాన్ పథకం కింద ఐదేళ్లలో రూ.1629.35 కోట్ల పెట్టుబడి సాయం రైతులకు అందినట్టు వెల్లడించారు. ఐదో ఏడాదిలోనే రూ.355.29 కోట్ల ఆర్థిక ప్రయోజనం కలిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని గజపతినగరం మండలం శ్రీరంగరాజపురం గ్రామానికి చెందిన రైతు వై.శ్రీనివాసరావుకు ముఖ్యమంత్రితో ముఖాముఖిగా మాట్లాడే అవకాశం లభించింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తాము నాణ్యమైన విత్తనాలు, ఎరువుల కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డామని, పాదయాత్ర సందర్భంగా మా సమస్యలను తమకు విన్నవించుకున్నామని తెలిపారు. ఇప్పుడు రైతుభరోసా కేంద్రాల ద్వారా సాగు సేవలు సకాలంలో అందుతున్నాయని, రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. నాలుగున్నరేళ్లుగా కరవు అనే మాట వినలేదని పేర్కొన్నారు. అనంతరం జిల్లాలోని రైతులకు విడుదలైన వైఎస్సార్ రైతుభరోసా నిధుల చెక్కును కలెక్టర్ నాగలక్ష్మి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ భావన, తదితరులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, జేసీ కె.కార్తీక్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ బి.సహాదిత్ వెంకట త్రివినాగ్, జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు, డీడీ అన్నపూర్ణ, ఉద్యానశాఖ ఎ.డి. ఏవీఎస్ జమదగ్ని, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటప్రకారం...

ఇచ్చిన మాట ప్రకారం ఏటా పెట్టుబడి సాగుసాయాన్ని రైతుల ఖాతాకు జమచేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రైతులంతా అండగా నిలవాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. ప్రభుత్వం వ్యవసాయానికి అందిస్తున్న తోడ్పాటుతో జిల్లా రైతాంగం నేడు సంతోషంగా ఉందన్నారు.

రైతన్నలను ఆదుకున్నది జగనన్న ప్రభుత్వమే..



నా పేరు పొటిపిరెడ్డి ఆదినారాయణ. మాది విజయనగరం మండలం రాకోడు గ్రామం. నాకున్న రెండున్నర ఎకరాల పొలంలో వ్యవసాయం చేస్తున్నాను. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏటా పెట్టుబడి సాయాన్ని అందిస్తోంది. నాణ్యమైన విత్తనాలు, ఎరువులను ఊరిలోని ఆర్‌బీకే నుంచి సరఫరా చేస్తోంది. ధాన్యానికి మద్దతు ధర కల్పించింది. విపత్తుల్లో పంట నష్టపోతే వెంటనే ఆదుకుంటోంది. గతంలో ఈ స్థాయిలో రైతుకు సాయం అందించిన వారు ఎవరూ లేరు.

సాగుకు ఆర్థిక తోడ్పాటు



నా పేరు రెడ్డి కృష్ణ. బాడంగి మండలంలోని కోడూరు గ్రామం. చిన్నకారు రైతును. నాకు రెండెకరాల భూమిలో వరి పంట సాగుచేస్తున్నాను. 80 వేలు వరకు పంట రుణం తీసుకున్నాను. ఐదేళ్లుగా ప్రభుత్వం వడ్డీ రాయితీ కింద ఏడాదికి రూ.4వేలు చెల్లిస్తోంది. కర్షకుల గురించి ఆలోచించే నాయకుడు జగనన్న. గతంలో పంట పోయినా పైసలిచ్చేవారు కాదు. జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వచ్చేది.

ఆపన్నహస్తం



ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద రైతులకు అందిస్తున్న పెట్టుబడి సాయం చాలా ఉపయోగకరం. గతంలో నాకున్న 4 ఎకరాల భూమిలో వ్యవసాయం చేసేందుకు పంట పెట్టుబడికి అప్పులు చేయాల్సి వచ్చేది. ప్రభుత్వం చలువతో ఇప్పటి వరకు 65వేలు అందింది. అప్పుకష్టాలు తప్పాయి. రైతుల మంచికోరే నాయకుడు పాలించడంతో ఐదేళ్లుగా కరువుచాయలు కనిపించలేదు.

– బండారుదేముడు, రైతు, నల్లబిల్లి వేపాడ మండలం

ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి 20వ తేదీ వరకు పరీక్షల నిర్వహణ
- జిల్లాలో 73 కేంద్రాల ఏర్పాటు
- పరీక్షలు రాయనున్న విద్యార్థులు 45,755 మంది
- స్ట్రాంగ్ రూమ్‌లో ప్రశ్నపత్రాలు భద్రం



పరీక్షల నిర్వహణపై నిర్వహించిన సమావేశానికి హాజరైన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు

విజయనగరం అర్బన్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందడి శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 11 నుంచి ప్రారంభమై 20వ తేదీ నాటికి ముగిశాయి. మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు థియరీ పరీక్షలు జరగనున్నాయి. నిఘా నీడలో పరీక్షలు నిర్వహించేందుకు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పరీక్ష కేంద్రంలోని ప్రతి గదిలోనూ సీసీ కెమెరాలు అమర్చారు. జిల్లాలో మొత్తం 45,755 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 20,630 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 25,125 మంది ఉన్నారు. జిల్లాలో మొత్తం 73 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షలు రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరుగుతాయి. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై జిల్లా కన్వీనర్ మజ్జి ఆదినారాయణ, జిల్లా పరీక్షల కమిటీ (డీఈసీ) సభ్యులు ప్రత్యేక దృష్టిసారించారు. జిల్లా కేంద్రానికి రెండు రోజుల కిందట వచ్చిన ప్రశ్నపత్రాలను స్థానిక ప్రాంతీయ ఇంటర్మీడియట్ పర్యవేక్షణ అధికారి కార్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. ఆర్మ్‌డ్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. 26వ తేదీ నుంచి 24 స్టోరేజ్ పాయింట్లు (పోలీస్ స్టేషన్ల)కు తరలించనున్నారు. 73 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 73 మంది డిపార్టుమెంటల్ అధికారులు, రెగ్యులర్ అధ్యాపకులు, లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లను నియమించారు. దాదాపు 1,200 మంది ప్రభుత్వ టీచర్లను ఇన్విజిలేటర్లుగా నియమించారు.


వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్...

విద్యార్థులు హాల్‌టికెట్ల కోసం ఎలాంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా 'బీఐఈఏపీ.ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్.ఐఎన్' వెబ్‌సైట్‌లో ఉంచారు. వెబ్‌సైట్ ద్వారా నేరుగా విద్యార్థులు తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదు. హాల్‌టికెట్ తీసుకుని నేరుగా పరీక్ష కేంద్రాలకు వెళ్లొచ్చు.

ఏ చిన్న పొరపాటుకూ తావివ్వొద్దు

ఇంటర్ పరీక్షల నిర్వహణలో ఏ చిన్న పొరపాటుకూ తావివ్వొద్దని ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ జిల్లా కన్వీనర్ మజ్జి ఆదినారాయణ అధికారులకు సూచించారు. చీఫ్ సూరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు. పరీక్ష కేంద్రాల్లో ఎవరూ సెల్‌ఫోన్లు వినియోగించరాదన్నారు. సీఎస్, డీఈలు, ఇతర సిబ్బంది తమ సెల్‌ఫోన్లను సీఎస్‌ల వద్ద డిపాజిట్ చేయాలన్నారు. బోర్డు నుంచి ప్రతి సెంటర్‌కూ కీ ప్యాడ్ ఫోన్లు పంపుతారన్నారు. వాటి ద్వారా సీఎస్‌లు సమాచారం పంపాల్సి ఉంటుందన్నారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. జిల్లా కేంద్రంలోని ఆర్ఐఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ (ఫోన్: 08922–237988)ను ఏర్పాటు చేశామన్నారు.





విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు జగన్ పెద్దపీట

- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ
- సెంచూరియన్‌లో స్మార్ట్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ప్రారంభం
- యూనివర్సిటీ అభివృద్ధికి సహకరిస్తామని తెలిపిన మంత్రి



సెంచూరియన్‌లో స్టాల్స్‌ను తిలకిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

నెల్లిమర్ల రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యమిచ్చారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. విజయనగరం జిల్లాలోని నెల్లిమర్ల మండలం టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో స్మార్ట్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కోర్సుతో పాటు కిసాన్ రైతు సమ్మేళన కార్యక్రమాన్ని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబుతో కలిసి బుధవారం ప్రారంభించారు. వర్సిటీ మొత్తాన్ని సందర్శించి ప్రయోగశాలలను తిలకించారు. నైపుణ్య శిక్షణ కేంద్రాలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి బొత్స మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన లక్ష్యమన్నారు. విద్యా సంస్థలను ప్రోత్సహించడం కోసం ప్రభుత్వం అనేక సంస్కరణలు ప్రవేశ పెట్టిందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పరిపాలనను కొనసాగిస్తున్నట్టు వెల్లడించారు. సెంచూరియన్ వర్సిటీ జిల్లాలో ఉండడం ఎంతో అవసరమని, ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ కొనసాగించాలని, ప్రభుత్వం తరపున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. రైతులు అధిక దిగుబడులు సాధించేలా వారిలో అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ఎక్కువ మంది రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని వారికి పంట సాగుకు అవసరమైన మెలకువలు నేర్పాలన్నారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు మాట్లాడుతూ రైతు దేశానికి వెన్నుముకలాంటి వారని, వ్యవసాయంలో మెలకువలు తెలుసుకొని మేలు రకం పంటలు పండించేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి సెంచూరియన్ సేవలు అభినందనీయమని కొనియాడారు. అనంతరం జరిగిన రైతు కిసాన్ మేళాలో పలువురు ఆదర్శ రైతులను మంత్రి బొత్స ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చిన అప్పలనాయుడు, వైస్ ప్రెసిడెంట్ డి.ఎన్.రావు, చాన్సలర్ జీఎస్‌ఎన్ రాజు, వీసీ పీకే మహంతి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య

భోగాపురం: వయసు పెరుగుతున్నా ఇంకా పెళ్లి కాలేదన్న మనస్తాపంతో మండలంలోని సుందరపేట గ్రామానికి చెందిన యువకుడు ఇనపగుర్తి జగదీష్ (28) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం జరిగిన ఈ సంఘటనపై పోలీసులు, మృతుని బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జగదీష్ కొన్నేళ్లుగా విశాఖపట్నంలోని ఫారెస్టు డిపార్ట్‌మెంట్‌లో డ్రైవర్‌గా (అవుట్ సోర్సింగ్) విధులు నిర్వహిస్తున్నాడు. వయసు పెరుగుతున్నా పెళ్లి కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే పురుగుమందు తాగేసి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు వెంటనే జగదీష్‌ను సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి వెంకటరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రవికుమార్ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

బొబ్బిలి: డొంకినవలస–బొబ్బిలి రైల్వే స్టేషన్ల మధ్య రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఔట్‌పోస్టు ఇన్‌చార్జ్ ఎస్.కృష్ణారావు విలేకరులకు తెలిపారు. కాషాయ రంగు నలుపు పువ్వుల లుంగీ, తెలుపు, బూడిదరంగు కలిగిన షర్టు వేసుకున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, ఎవరైనా గుర్తు పడితే ఎస్సై రవివర్మ ఫోన్ 9490617089నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

30 మద్యం బాటిల్స్ స్వాధీనం

దత్తిరాజేరు: మండల కేంద్రం దత్తిరాజేరు కూడలి వద్ద అక్రమంగా తరలిస్తున్న 30 మద్యం బాటిల్స్ పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు పెదమానాపురం ఎస్సై శిరీష బుధవారం తెలిపారు. స్థానికులు అందజేసిన సమాచారం మేరకు అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

వంగరలో మరో 30

వంగర: మండల పరిధి శ్రీహరిపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుబడినట్లు ఎస్సై వైవీ జనార్దన్ బుధవారం తెలిపారు. మద్దువలస వద్ద పట్టుబడిన ఆ వ్యక్తి నుంచి 30 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఎన్నికల పనులన్నీ పూర్తిచేయాలి

- కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఎన్నికల నిర్వహణ పనులు పూర్తి చేయాలని, నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌కు తెచ్చే వరకూ సెక్టార్ అధికారులు కీలక బాధ్యత వహించాల్సి ఉంటుందని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సెక్టార్ అధికారులకు బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెక్టార్ అధికారులతో పాటు పోలీస్ శాఖ నుంచి కూడా సెక్టార్ అధికారులు ఉంటారని, వీరిద్దరి మధ్య సమన్వయంతో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. సెక్టార్ అధికారులకు మెజిస్టీరియల్ పవర్స్ ఉంటాయని, ప్రతీ కార్యక్రమం వారి నియంత్రణలోనే జరగాలని స్పష్టం చేశారు. శిక్షణలో డూస్, డూ నాట్స్, చెక్ లిస్టు, హ్యాండ్ బుక్ ఇవ్వడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ నిబంధనలన్నింటినీ చదువుకుని పాటించాలని, సొంత నిర్ణయాలు తీసుకోకూడదని తెలిపారు. పోలింగ్ కేంద్రాలను పూర్తిస్థాయి సదుపాయాలతో సిద్ధంచేయాలన్నారు. రూట్ మ్యాప్‌లను తయారుచేసుకోవాలన్నారు. నోటిఫికేషన్ వెలువడిన తరువాత కనీసం 3 సార్లు పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేసి రూట్ మ్యాప్‌లను తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ సుధాకరరావు ఎన్నికల నియమావళి పత్రాల్లోని అంశాలను వివరించారు. శిక్షణ కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్వో అనిత, సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్ పాల్గొన్నారు.

అభివృద్ధి వెం‘బడి’

- డిజిటల్ విద్యలో ముందంజలో విజయనగరం విద్యార్థులు
- ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ నాగార్జున యాదవ్



నెల్లిమర్ల బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ యనమల నాగార్జున యాదవ్



మౌలిక సదుపాయాలపై విద్యార్థులతో ముచ్చటిస్తున్న నాగార్జున యాదవ్

విజయనగరం అర్బన్/నెల్లిమర్ల: పేదలు చదువుకునే ప్రభుత్వ బడుల్లో డిజిటల్ విద్యను ప్రవేశపెట్టి, అధునాతన బోధన విధానాలను విద్యార్థులకు కల్పించాలనే ఆలోచన దేశంలోనే ప్రప్రథమంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేశారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక వసతుల సదుపాయాల కల్పన సంస్థ చైర్మన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) యనమల నాగార్జున యాదవ్ తెలియజేశారు. ఈ మేరకు విజయనగరం జిల్లాలో నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన ఉన్నతమైన మార్పులను, అదనంగా నిర్మించిన తరగతి గదులను, నిర్వహిస్తున్న డిజిటల్ క్లాస్‌రూమ్స్‌ను పరిశీలించేందుకు విజయనగరం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన జిల్లాలోని పలు పాఠశాలల్లో నాడు-నేడు పనులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించి, నాడు-నేడు కార్యక్రమం ద్వారా జరిగిన అభివృద్ధి పనులపై వాకబు చేశారు. 10 రకాలైన మౌలిక వసతులు తప్పకుండా ప్రతి ప్రభుత్వ బడిలోను విధిగా ఉండాలనే ఉన్నత ఆశయంతో విజయనగరం జిల్లాలోని 27 మండలాల్లో 1579 పాఠశాలల్లో రూ.431 కోట్లు ఖర్చు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. జిల్లాలోని మెట్టపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నెల్లిమర్ల జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, ధర్మపురి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బుడతనాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను నాగార్జున యాదవ్‌తో పాటు ఏపీఈడబ్ల్యూఐడీసీ బృందం సందర్శించింది. రాష్ట్రంలో రూ.17 వేల కోట్లకు పైగా వెచ్చించి ప్రభుత్వ బడులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధి చేశారని, ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించారని, ఈ అవకాశాన్ని విద్యారులంతా తప్పక ఉపయోగించుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు.

ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు

గతంలో పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు లేక చాల ఇబ్బందులు పడేవారం. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే మా బడి ముఖచిత్రమే మారిపోయింది. మరుగుదొడ్ల నుంచి ఐఎఫ్‌పీ ప్యానెల్స్ దాకా ఈ ప్రభుత్వం ఎంతగానో తమను ప్రోత్సహించినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని విద్యార్థులు తెలియజేశారు. ఈ పర్యటనలో ఏపీఈడబ్ల్యూఐడీసీ డైరెక్టర్ బమ్మిడి లక్ష్మి, ఈఈ డీవీఎస్ మూర్తి, డీఈ వేణుగోపాల్, ఏఈ జాన్సన్, ఎంఈఓలు యుఎస్ఎన్ మూర్తి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘ఏకలవ్య’లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: ఐటీడీఏ పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 6, 7, 8, 9వ తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లకు ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల మార్చి 31లోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపీటీడబ్ల్యూ గురుకులం.ఏపీ.జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కన్వీనర్ ఫోన్ 6303508032, గురుకులం సెల్ ఇన్‌చార్జ్ 9490971090 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పాఠశాలలో ఖాళీలు ఇలా ఉన్నాయి

- ఏకలవ్య కురుపాంలో 6వ తరగతిలో 30 (బాలురు),30 బాలికలతోపాటు 7వ తరగతిలో ఒకటి బాలికలు, 9వ తరగతిలో 8 (బాలురు),3 (బాలికలు)కు సీట్లు ఖాళీగా ఉన్నాయి.
- ఏకలవ్య అనసభద్ర పాఠశాలలో 6వ తరగతిలో 30(బాలురు), 30 (బాలికలు)తోపాటు 7వ తరగతిలో 3 (బాలురు),4 (బాలికలు), 8వ తరగతిలో 2 (బాలురు), 1(బాలికలు),9వ తరగతిలో 1(బాలురు)
- ఏకలవ్య కోటికపెంట పాఠశాలలో 6వ తరగతిలో 30(బాలురు),30(బాలికలు), 7వ తరగతిలో 1(బాలురు), 1(బాలికలు), 8వ తరగతిలో7(బాలురు), 9వ తరగతిలో 5(బాలురు)
- ఏకలవ్య గుమ్మలక్ష్మీపురంలో 6వ తరగతి 30(బాలురు), 30(బాలికలు),7వ తరగతిలో 3(బాలురు) సీట్లు ఖాళీగా ఉన్నాయి.

దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిల్స్ పంపిణీ



వికలాంగులకు బ్యాటరీ ట్రై సైకిల్స్ అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: జిల్లా పరిషత్ నిధులతో కొనుగోలు చేసిన బ్యాటరీ ట్రై సైకిల్స్‌ను జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు దివ్యాంగులకు బుధవారం అందజేశారు. ఈ మేరకు జెడ్పీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రాజాం మండలం బొద్దాం గ్రామానికి చెందిన కొరికానా శ్రుతి, కొటారిపురం గ్రామానికి చెందిన భట్న భవాని, గుర్ల మండలం చింతపల్లిపేట గ్రామానికి చెందిన పట్నాన సన్యాశినాయుడులకు జెడ్పీ చైర్మన్ బ్యాటరీ ట్రైసైకిల్స్‌ను అందజేశారు.

రూ.50 వేల చెక్కు అందజేత

రాజాం మండలం బొద్దాం గ్రామానికి చెందిన బండి పార్వతి ఇటీవల విద్యుత్ షాక్‌తో మరణించడంతో ఆమె భర్త బండి భాస్కరరావుకు జెడ్పీ సాధారణ నిధుల నుంచి రూ.50 వేల చెక్కును జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో గుర్ల ఎంపీపీ పొట్నూరు సన్యాసినాయుడు, రాజాం వైస్ ఎంపీపీ నక్క వర్షినిమోహన్, బొద్దాం సర్పంచ్ నక్క శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మూడు చీటింగ్ కేసుల్లో నిందితుడికి జైలు శిక్ష

విజయనగరం క్రైమ్: ఓఎల్ఎక్స్‌లో బైకులు అమ్ముతామని మోసగించి, కొనుగోలు దారుల నుంచి డబ్బులు తీసుకుని, మోసగించినట్లు రుజువైన మూడు కేసుల్లో ముద్దాయి కర్రి శివ రామకృష్ణకు ఆరు నెలల సాధారణ జైలు శిక్ష, రూ. 1500 జరిమానా విధిస్తూ ఏజేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి బి.రమ్య బుధవారం తీర్పు వెల్లడించినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. ముద్దాయి జరిమానా చెల్లించని పక్షంలో ఒక్కో కేసులో మరో నెల చొప్పున జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నట్లు సీఐ చెప్పారు. వెల్లడించారు. కేసుల్లో దర్యాప్తు అధికారిగా అప్పటి వన్‌టౌన్ ఎస్సై వి.అశోక్ కుమార్ వ్యవహరించగా, సీనియర్ ఏపీపీ రాజరాజేశ్వరి పోలీసుల తరఫున వాదనలు వినిపించారని సీఐ వివరించారు.

భార్యను వేధిస్తున్న భర్తకు ఏడాది జైలు

బొబ్బిలి: కట్నం కోసం భార్యను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్న భర్తకు ఏడాది జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా కోర్టు విధించినట్లు సీఐ ఎం.నాగేశ్వరరావు తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని యాతవీధికి చెందిన లెంక గోవిందమ్మను తూర్పుగోదావరి జిల్లా సైదులుపేటకు చెందిన భర్త లెంక రాము నాయుడు కట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని డిసెంబర్ 20, 2014లో ఆమె ఫిర్యాదు చేసింది. దీనిపై అప్పటి ఎస్సై నాయుడు కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. దీనిపై పార్వతీపురం రెండో అదనపు జడ్జి ఎస్ దామోదరరావు ముద్దాయికి సంవత్సరం జైలు శిక్ష, వెయ్యిరూపాయల జరిమానా విధించారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటరావు వాదించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹ 260

పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు

విజయనగరం క్రైమ్: మోటారు సైకిళ్ల చోరీలు, దొంగతనాల కేసుల ఛేదనలోనూ.. అక్రమ మద్యం, గంజాయి, నాన్ బెయిల్‌బుల్ వారంట్ల ఎగ్జిక్యూషన్.. ట్రాఫిక్ రెగ్యులేషన్, డ్రంకన్ డ్రైవ్ కేసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు నమోదు చేయడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ఎం.దీపిక బుధవారం స్థానిక పోలీస్ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రశంసాపత్రాలు పొందిన వారిలో విజయనగరం టూటౌన్ సీఐ కేకే రామారావు, ఎస్సైలు ఐ.దుర్గాప్రసాద్, జి.రాజేష్, ఎస్.హరిబాబునాయుడు, జె.తారకేశ్వరరావు, ఏఎస్సై సీహెచ్. ఆరి, హెచ్‌సీ ఎన్.హరికృష్ణ, కానిస్టేబుళ్లు ఎం.వాసు, కేవీ గణేష్, కె.సత్యం, వి.రఘు, టి.సతీష్, డి.దేముడు, జి.రమేష్, సీహెచ్. అప్పలనాయుడు, ఎం.మహేశ్వరరావు, కె.చిరంజీవి, వై.సతీష్ కుమార్, మహిళా కానిస్టేబుళ్లు జి.గౌరమ్మ, మహిళా హోంగార్డు ఎస్. ఇందుమతి ఉన్నారు.

టెండర్ ప్రకటన
శ్రీ కలెక్టర్ వారి కార్యాలయం, విజయనగరం జిల్లా

శ్రీజిల్లాకలెక్టర్ వారి కార్యాలయం, విజయనగరం జిల్లా, కార్యాలయానికి సాధారణఎన్నికలు–2024 గాను ఇందులో ఇత పరచబడిన స్టేషనరీ సామాగ్రి కొనుగోలు చేయు నిమిత్తం "స్వల్ప కాలిక" "సీల్డ్ టెండర్లు" ఆహ్వానించడమైనది. టెండర్లు ప్రకటన మరియు తదుపరి వివరములకు గాను సంప్రదించవలసిన **ఫోన్ నెం.08922-236947& 9491012020.**

టెండర్లు స్వీకరించు స్థలం : పరిపాలనాధికారి, జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం, విజయనగరంలో తే.02.03.2024. మధ్యాహ్నం గం.04.00.ల వరకు (కార్యాలయపు పనివేళలలో)

టెండర్లు తెరుచుస్థలం : శ్రీ సంయుక్త కలెక్టర్, విజయనగరం వారి చాంబరు నందు తే.04.03.2024.ది, సమయం: సాయంత్రం గం.05.00.లకు.

నిభందనలు మరియు షరతులు:

- టెండరులో పాల్గొనదలచినవారు ధరావత్తు రుసుముగా రూ. 50,000/- (అక్షరాలా యాభై వేల రూపాయలు మాత్రమే), విజయనగరం జిల్లా కలెక్టర్ వారి పేరున చెల్లించవలెను.
- టెండర్లు మంచి దస్తూరితో, తప్పు, దిద్దుబాట్లు లేకుండా నుండవలెను. టెండరులో పాల్గొనదలచిన సంస్థ, విధిగా ఆ సంస్థ యొక్క రిజిస్ట్రేషన్ అమలులో నున్న సర్టిఫికెట్, జి.ఎస్.టి సర్టిఫికెట్, పాన్ కార్డు కలిగియుండవలెను.సదరు టెండర్లు స్వీకరించుటకు, వాయిదా వేయుటకు మరియు ఏ కారణము చూపకుండా రద్దు చేయుటకు దిగువ సంతకముదారునకు పూర్తి అధికారము కలదు.
- చివరి బిడ్ పూర్తి అయిన పిదప, టెండర్ దారుడు వారి యొక్క స్వంత ఖర్చులతో, విజయనగరం జిల్లాలో గల మండలములకు మరియు డివిజినల్ కార్యాలయములకు యూనిట్లును చేరవేసి, వారియొక్క స్వంత ఖర్చులతో చేరవేసి, అమర్చి పనితీరు సక్రమముగానున్నట్లు సంబంధిత అధికారి వారి నుండి సర్టిఫికెట్ పొంది ఈ కార్యాలయమునకు సమర్పించవలెను. ఎటువంటి అదనపు ఖర్చులు చెల్లింపబడవు. ఇన్వెర్టర్, మరియు వాటి సంబంధిత ఎలక్ట్రికల్ పరికరములు యొక్క వారంటీ విడిగా పేర్కొనవలెను.
- ఇతర వివరములను ఈ కార్యాలయపు పరిపాలనా అధికారి వారి కార్యాలయము, విజయనగరం వారి ఫోన్ నెంబర్ **9491012020** కి సంప్రదించవచ్చును.
- క్రింద టెండర్లో తెలుపబడిన స్టేషనరీసామాగ్రి మొత్తమును అనగా మొత్తం ఒక బాగ్ చొప్పున మొత్తం 2217 బాగ్ లలో భద్రపరిచి, జిల్లా కలెక్టర్ వారి కార్యాలయమునకు అప్పగించవలెను.

S.No	Item	Item Company	Quantity for each polling station
1	Distinguishing mark rubber Stamp		1Nos
2	Mock Poll Slip Stamp		1Nos
3	Plastic Box and containing items		1No
	a)Stamp pad (Purple)		1No
	b)Match box		1No
	c)Sigh Boards(A4 Size)		
	(i)Presiding Officer		1No
	(ii)Polling Officer-1		1No
	(iii) Polling Officer-2		1No
	(iv)Polling Officer-3		1No
	(v)Polling Officer-4		1No
	(vi)Polling Officer-5		1No
	(vii)Micro Observer		
	(viii)Entry		1No
	(ix)Exit		1No
	(x)Male		1No
	(xi)Female		1No
	(xii)Polling Agent		1No
	(xiii)You are under WEB CASTING/CCTVSurveilance.		4Nos
d	(xiv)Miscellaneous notice specifying etc as required by under Rule 31(1)(a)of the Conduct of Elections Rule 1961.		1No
e	Ordinary Pencils with sharpener)		2Nos
f	Ball Pen (three blue,one Red and Silver,white)	Reynolds	Blue -3 Red-1 Silver white-1
g	Blank Paper	JK Paper	15 Sheets
h	Small Stapler &pins	Kangaro Lion	1 Stapler 1 Pin box with 25 pieces 1 Soft Head Pins Box
i	Sealing wax	Red Bud	10Sticks
j	Gum Paste	Camlin	300ml 1No
k	Blade	Folding Knife	1No
l	Candle sticks	Candles	4Nos
m	Thin Twine Thread	Twine Thread	100 mtrs bundle
n	Metal Ruler	Ajanta	1No
o	Carbon Paper	Camel	6
p	Cloth or rag for removing oil etc	Cotton Cloth	1mtr cloth
q	Packing Paper	Packing paper	6 Sheets
r	Cup/empty tin/ Plastic box for holding indelible ink bottle	Kissan Paras	1
s	Drawing Pins	Globe	40 Pieces pack
t	Rubber Bands	Nokea	50 Pieces packets
u	Transparent Adhesive tape	Wonder 555	1No
v	Black Skect pens	Luxor	3
w	Thick Black Clour Marker pen	Camlin	1
x	Check List(A4 Size)		2

సం/- కె.కార్తీక్,
జాయింట్ కలెక్టర్, విజయనగరంజిల్లా.

ఆధునిక సాంకేతికత పెంపొందించుకోవాలి

- జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య



సత్కారం పొందుతున్న యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: ఉన్నతమైన ఉద్యోగం, మెరుగైన ఉపాధి అవకాశాల కోసం ఇంజినీరింగ్ విద్యతో పాటు ఆధునిక సాంకేతికత పెంపొందించుకోవాలని జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. ఈ మేరకు జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించే జాతీయస్థాయి సాంకేతిక సింపోజియాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించడం ద్వారా భవిష్యత్‌లో దేశాభివృద్ధికి కీలకంగా నిలుస్తారన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన సాంఖ్యా టెక్నాలజీస్ సీఈఓ, ప్రధాన సాంకేతిక నిపుణుడు గోపికుమార్ బులుసు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు పెద్ద సంఖ్యల్లో రోజువారీ సమస్యలను పరిష్కరిస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా సాంఖ్యా టెక్నాలజీస్ రూపొందించిన డిజిటల్ బ్యాగ్‌పై విద్యార్థులకు వివరించారు. అనంతరం యూనివర్సిటీ వీసీని ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విభాగాధిపతి బి.నళిని, డైరెక్టర్లు డాక్టర్ కె.బాబులు, కేసీబీరావు, టీఎస్ఎన్‌మూర్తి, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌గురునాథ, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్స్ డాక్టర్ జి.అప్పలనాయుడు, డాక్టర్ ఎం.హేమ, స్టూడెంట్ కోఆర్డినేటర్స్ ఎస్‌కేమోహిద్దీన్ బాబా, ఆర్ లిపిక చౌదరి, సీహెచ్ కాశీవిశ్వనాథన్, పూడి లిఖితశ్రీ, వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌లో ఫిషరీస్ సైన్స్ కోర్సుకు ఐసీఏఆర్ గుర్తింపు



సెంచూరియన్ వర్సిటీలోని ఫిషరీస్ విభాగం



స్టార్ నైట్‌లో పాల్గొన్న వర్సిటీ విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఒడిశాలోని పర్లాకిమిడిలో ఉన్న ప్రతిష్టాత్మక సెంచూరియన్ యూనివర్సిటీ మరో ఘనతను సొంతం చేసుకుంది. కళాశాలలో ఉన్న బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ డిగ్రీ కోర్సు (ప్రోగ్రాం)కు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) గుర్తింపుతో పాటు అనుమతి లభించింది. ఫిషరీస్ మేనేజ్‌మెంట్‌తోపాటు ఆక్వా కల్చర్‌పై విద్యార్థులకు పరిశీలనతో పాటు ప్రాక్టికల్స్ నేర్పించేందుకు తాజా గుర్తింపు దోహదపడుతుందని భావిస్తున్నారు. బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ డిగ్రీ కోర్సులో ఆక్వా కల్చర్, ఫిషరీస్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్, ఫిష్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఆక్వాటిక్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్, ఫిష్ ఇంజినీరింగ్, ఆక్వాటిక్ యానిమల్ హెల్త్ మేనేజ్‌మెంట్, ఫిషరీస్ ఎక్స్‌టెన్షన్, ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్ తదితర సబ్జెక్టులు ఈ డిగ్రీ ప్రోగ్రాంలో భాగంగా ఉంటాయని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. కోర్సుకు ఐసీఏఆర్ గుర్తింపు లభించడం పట్ల ప్రొఫెసర్ డీఎస్.రావు సంతోషం వ్యక్తంచేశారు.

ఉత్సాహంగా గజజ్యోతి ఫెస్టివల్

పర్లాకిమిడి: సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లోని మల్టీపర్పస్ గ్రౌండ్స్‌లో మంగళవారం రాత్రి జరిగిన గజజ్యోతి వెట్ ఫెస్టివల్ – 2024 విద్యార్థులను అలరించింది. వేడుకలను వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డీఎస్.రావు ప్రారంభించగా, రిజిస్ట్రార్ డా.అనితా పాత్రో వార్షిక నివేదికను చదివి వినిపించారు. అనంతరం మూడు రోజులుగా జరిగిన వివిధ స్పోర్ట్స్ ఈవెంట్స్, డ్రామా, డ్యాన్స్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా స్టార్ నైట్ సాంస్కృతిక ప్రదర్శనల్లో బాలీవుడ్ పాప్ సింగర్ మధుర్ శర్మ, మరో సింగర్ చందన్ జైశ్వాల్ (ముంబై) తమ పాటలతో అలరించారు. అదేవిధంగా క్యాంపస్‌లో ఫుడ్ ఫెస్టివల్‌ను విద్యార్థులు ఆస్వాదించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

DISTANCE EDUCATION

- ఆంధ్రా యూనివర్సిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్: BA, B.Com, B.Sc., MA, M.Com., M.Sc., MBA & MCA అడ్మిషన్స్ జరుగుచున్నవి. ఫోన్: 73862 63237, 90590 86040 [V-2415]

LAND FOR SALE

- AC 1.42 Cents of Land Bearing Sr. No.138/ 2 to 18 with 5000 Sq.Ft Shed Currents & Water, Surronded by Boundry wall at Kondarajupeta, Mopada Village, Denkada Mandal, Vizianagaram Dist. Ph : 77320 07771 [V- 3831]
- విజయనగరం టౌన్ రింగురోడ్డుకు ½ K.M, 60 అడుగులు రోడ్డుకు ఆనుకుని 900 గజాలు స్థలం కలదు. గజం 19000 రూపాయలు. ✆ 9440434781, 7731897899 [C-718404]

BUSINESS OFFER

- ద్వారక ఎంటర్‌ప్రైజ్: పేపర్‌ప్లేట్స్ & LED మిషన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం. ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం ✆ 9310515624, 8800496710 [G-1438]

ASTROLOGY

- శ్రీ గాయిత్రీదేవి జ్యోతిష్య పీఠం. S.V. శాస్త్రీ గారు గతం 20 సం VZM స్థిరపడి ఉన్నారు. మీ బ్రోటన వ్రేలు, హస్త రేఖలు, జాతక చక్రం చూసి సంపూర్ణ జోతిష్యం చెప్పబడును. వివాహం, సంతానం, ఆరోగ్యం, స్త్రీ పురుషులకు ఎటువంటి సమస్యలకైనా శాశ్వత పరిష్కారం చేయబడును. Opp భాష్యం స్కూల్, VZM. 9701778711 [S-6110]

HOTEL MANAGEMENT

- VZM 90రోజులు ఉచిత Hotel Management ట్రైనింగ్‌తో పాటు, ఉద్యోగం కల్పించబడును. SSC (PASS), Inter, Degree, ITI (Pass/Fail). Age:18to 35. Contact : 9390567363, 7702568799 [S-1260331]

WANTED

- చీపురుపల్లిలో 6,50,000/– వుడా ప్లాట్లు. ఈ ప్లాట్స్ మార్కెటింగ్ చేయుటకు టెలీకాలర్ స్టాఫ్ కావలెను. 25,000/– జీతం, బస్‌పాస్ ఇవ్వబడును. 7997911911 [S-1260329]
- మార్చి మొదటి వారంలో అమెరికా వెళుతున్న మాకు ఇంటి, వంట పనులు చేయుటకు ఆడమనిషి కావలెను. అమెరికా విజిటింగ్ వీసా కలిగిన వారు మాత్రమే సంప్రదించగలరు. ✆ 92904 15199 [B-790486]
- అర్జెంటుగా కావలెను VZM Sai Golden Ventures కంపెనీ నూతన కార్పొరేట్ ఆఫీస్‌లో పనిచేయుటకు టెలీకాలర్స్ (F) 10, AGM, DGM, GM న్యూ & సీనియర్ మార్కెటింగ్ మిత్రులకు ఇదే ఆహ్వానం. ఫుల్+పార్ట్‌టైం మంచి జీతం, అలవెన్స్, భోజనం, కమీషన్ కలదు. Call: 8125159959 [S-1260679]
- బొబ్బిలి, సాలూరు మండలంలో మా కంపెనీ నందు MI సర్వే చేయుటకు యువతి యువకులు కావలెను. Smart Phone ఉండవలెను. ఫోన్: 76610 46292 [V- 11745]
- విజయనగరం జిల్లాలో మండలాలవారీగా ఇన్ చార్జిగా పనిచేయుటకు 45 మంది యువకులు కావలెను. వయస్సు 18 to 25, Q:9th, 10th ఇంటర్, ITI (P/F), ఫీజు లేదు. ఫ్రీ రూం డైరెక్ట్ జాబ్ ✆ : 91604 94344 [R-4685]
- ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 9059663584. [M-1233856]
- త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఫోన్: 9160900024 / 9640400073. [H-793697]
- షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడి సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, వాచ్‌మెన్‌లు, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-13601]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.